Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption

హైదరాబాద్
27-3-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 133

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# వైనాట్ పులివెందుల



## జగన్ అడ్డాలో టీడీపీ పాగా..!



వైఎస్ జగన్ అడ్డాలో పాగా వేయాలన్నది టీడీపీ ప్లాన్

ఇప్పటి నుంచే అందుకు వ్యూహరచన చేస్తోంది.

పులివెందులలో మహానాడును ఘనంగా నిర్వహిస్తే.

రాయలసీమ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపడమే

ఏపీలో ఎన్నికలు అయిపోయాయి.. కానీ ఆ రాజకీయ వేడి మాత్రం ఇంకా సెగలు కక్కుతూనే ఉంది. 2024 ఎన్నికల వేళ వైనాట్ కుప్పం అని వైసీపీ అంటే... వైనాట్ పులివెందుల అని టీడీపీ నినాదం ఎత్తుకుంది. అయితే.. వైసీపీకి ఘోర ఓటమి తప్పలేదు. జనసేన, బీజేపీతో కలిసి టీడీపీ ఘనవిజయం సాధించింది. వైఎస్ కుటుంబం కంచుకోట అయిన కడప జిల్లాలో కూడా పచ్చ జెండా రెపరెపలాడింది. ఉమ్మడి కడప జిల్లాలోని 10 స్థానాల్లో ఏడు స్థానాలను కూటమి విజయం సాధించింది. ఐదు స్థానాలు టీడీపీ సొంతం కాగా... బీజేపీ, జనసేన చెరో స్థానంలో గెలిచాయి. అయితే.. ఎంత ప్రయత్నించినా జగన్ అడ్డా పులివెందులను మాత్రం టచ్ చేయలేకపోయాయి కూటమి పార్టీలు. ఎన్నికలు అయిపోయాయి..

క్రైమ్ మిర్రర్, అమరావతి బ్యూరో

మిగతా 2లో

## ఆ మంత్రి పదవి కోసం
# నలుగురు పోటీ..!
## రాజగోపాల్‌రెడ్డి ఆశ నెరవేరానా?



ఆశావహులు పదవి కోసం పోటీ..!

కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీ..

మంత్రి పదవి రేసులో ముందుగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు

మంత్రి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని

సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి వైపు మొగ్గుచూపుతారో

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

తెలంగాణలో కేబినెట్ విస్తరణ పెద్ద చిక్కుముడిగా మారుతోంది. ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ఉందని సమాచారం. దీంతో.. ఆశావహులు పదవి కోసం పోటీ పడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని సామాజిక వర్గాల వారీగా కేటాయించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒకటి మాత్రం రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించినట్టు సమాచారం.

- మిగతా 2వ పేజీలో

## బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల
# నిషేధానికి సిట్



వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు బిల్లు

ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం

శాంతిభద్రతలపై కొందరు అడ్డగోలు వ్యాఖ్యలు

అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తాము అధికా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు లేవని చెప్పారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వేస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

- మిగతా 2వ పేజీలో



## లోక్‌సభలో ప్రతిపక్ష గొంతు నొక్కే కుట్ర

స్పీకర్ సభ నడిపే తీరు ఇది కాదు

మీడియాతో విపక్షనేత రాహుల్

2లో

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరందతస్థుల భవనం

ఇద్దరు మృతి..పలువురికి గాయాలు

శిథిలాలు తొలగిస్తే.. మృతేల సంఖ్యపై స్పష్టత

నాసిరకం నిర్మాణం కారణంగానే కూలిందన్న వాదన

3లో



## భూభారతిపై వాడీవేడి చర్చ

భూభారతి కాదు..భూహారతి అన్న పల్లా

ధరణి పేరుతో బిఆర్ఎస్ దగా చేసింది

అందుకే ధరణిని బంగాళాఖాతంలోకి విసిరాం

పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం

వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని పొంగులేటి సవాల్

2లో

## తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

శాంతిభద్రతల విషయంలో రాజీలేదు

గత బిఆర్ఎస్ ఛుత్వం లాగా వ్యవహరించడం లేదు

శాంతిభద్రతలపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** శాంతి భద్రతల విషయంలో

- మిగతా 2వ పేజీలో

## సభా నిబంధనలకు విరుద్ధంగా సిఎం ప్రకటన

అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కస్తున్నారు

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై జడ్జిమెంట్ ఎలా ఇస్తారు

అందుకే సభనుంచి వాకౌట్ చేశామన్న హరీష్ రావు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పార్టీ మారిన ఎమ్మెల్యేలు వాపస్ పోతారనీ డౌట్ వచ్చిందేమో.. అందుకే ఉప ఎన్నికలు రావని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మిగతా 2వ పేజీలో



2లో

## రేషన్‌కార్డు దారులకు
# సన్నబియ్యం

30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

త్వరలోనే కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు

మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు

తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మించి తీరుతాం

అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# వైనాట్ పులివెందుల

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ వేడి చల్లబడిందని అందరూ అనుకున్నారు. కానీ.. టీడీపీ మాత్రం పులివెందులకు గురిపెట్టే ఉందట. వైనాట్ పులివెందుల స్ట్రాటజీతోనే ముందుకు వెళ్తోందట. అందుకు.. మహానాడును అస్త్రంగా వాడుకోబోతోందని సమాచారం. ఈ ఏడాది (2025) మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది. ఈసారి మహానాడు ఎక్కడ నిర్వహిస్తే బాగుంటుందన్న చర్చ వచ్చినప్పుడు.. కడప అయితే బెస్ట్ అని పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. దీంతో.. మహానాడు నిర్వహించేందుకు కడపలో



రెండు, మూడు స్థలాలు కూడా చూసిపెట్టుకున్నారట. అయితే.. కడపలో కాకుండా పులివెందులలో మహానాడు పెడితే ఎలా ఉంటుందని టీడీపీ పెద్దలు ఆలోచనలో పడ్డారని సమాచారం. పులివెందులలో మహానాడును ఘనంగా నిర్వహిస్తే... రాయలసీమ పార్టీ కేడర్‌లో మరింత ఉత్సాహం నింపడమే కాకుండా... ఒక బలప్రదర్శనలా ఉంటుందనేది టీడీపీ ఆలోచన. ఎలాగైనా.. వైసీపీ అధినేత, వైఎస్ జగన్ అడ్డాలో పాగా వేయాలన్నది టీడీపీ ప్లాన్‌గా తెలుస్తోంది. ఇప్పటి నుంచే అందుకు వ్యూహరచన చేస్తోంది. ఆ వ్యూహాన్ని మహానాడుతో ముందుకు తీసుకెళ్లాలని తెలుగు దేశం పార్టీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే... మహానాడును కడపలో నిర్వహిస్తారా..? పులివెందులలో నిర్వహిస్తారా..? అన్నది టీడీపీ ఇంకా ఫైనల్ చేయలేదు. పులివెందులలో మహానాడు పెడితే మాత్రం... ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారుతుంది.

# రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

హైదరాబాద్,మార్చి26(ఆర్ఎన్ఎ): రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు- ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శాసనసభ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం 8వ ప్రపంచ వింత అని పెయిడ్ ప్రచారం చేయించారని దుయ్యబట్టారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆరే ఇంజినీర్ కావడం దౌర్భాగ్యమని అన్నారు. లూజ్ సాయిల్, లూజ్ ఫౌండేషన్ మీద కాళేశ్వరాన్ని నిర్మించడం పెద్ద తప్పు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావును క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు. కమిషన్ కె అంటే కాళేశ్వరం, కరెంటు కొనుగోళ్లు, కాకతీయ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చురకలంటించారు. శాసన సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికి లాబీలోకి వెళ్లి నిరసన తెలపడం సరికాదని ధ్వజమెత్తారు. సభ జరుగుతున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని, లాబీల్లో ఫొటోలు తీసిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్షల్స్‌పై బిఆర్ఎస్ సభ్యులు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతోనే బిఆర్ఎస్‌ను ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని, బిఆర్ఎస్ నేత కవిత లిక్కర్ స్కామ్ చేయడంతోనే ఢిల్లీలో ప్రభుత్వం పోయిందని ఎద్దేవా చేశారు. సభలో బిఆర్ఎస్ కావాలని హంగామా చేసిందని, కావాలని లాబీల్లోకి వెళ్లి షో చేశారని దుయ్యబట్టారు.

## సభా నిబంధనలకు విరుద్ధంగా సిఎం ప్రకటన

మాట్లాడాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న పార్టీ ఫిరాయింపుల విషయమై నిబంధనలకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడింది పూర్తిగా అసెంబ్లీ పార్లమెంట్ వ్యవస్థకు విరుద్ధం. కోర్టులో పెండింగులో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదని పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉంది. కోర్టు పరిధిని అధిగమించి ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నా కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయంపై జడ్జిమెంట్ ఇచ్చాడు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై కారు, ఉప ఎన్నికలు రానే రావు అని జడ్జిమెంట్ ఇచ్చారు. ముఖ్యమంత్రి తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయం మీద మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకే వస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందుకే తాము సభలో అభ్యంతరం చెప్పామని, నిరసనగా వాకౌట్ చేశామని అన్నారు.


పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద నేను చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో నా మైక్ కట్ చేశారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశాం. సలహాలు ఇవ్వాలంటే ఇవ్వచ్చని ముఖ్యమంత్రి చెప్పారు, కానీ సలహాలు ఇవ్వడానికి మైక్ ఇవ్వాలని కోరితే ఇవ్వలేదు. ప్రతిపక్షం గొంతు నొక్క ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ సభ్యులు ఉన్నవారికి మైక్ ఇస్తున్నారు, మాకు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్ బ్యాన్ చేస్తూ వచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో బెట్టింగ్ యాప్స్‌ని కంట్రోల్ చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక అత్యాచారం, ఆరు గంటలకు ఒక హత్య జరగుతున్నది. లా అండ్ ఆర్డర్ మెయిన్టైన్ చేయడంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఫెయిలయ్యారు. ఒకరోజే హైదరాబాద్‌లో రెండు అత్యాచార ఘటనలు, రెండు హత్యలు జరిగాయి. హైదరాబాద్‌లో 50 శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పెట్టిన సీసీ కెమెరాలును మెయింటైన్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. పోలీసులకు ఆత్యాధునిక వాహనాలు మేం కొనిస్తే మీరు డీజిల్ పోయించే పరిస్థితిలో కూడా లేరు. పోలీస్ చరిత్రలో పోలీసు కుటుంబాలను పోలీసుల చేత అరెస్టు చేయించిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అమనగల్‌లో ముఖ్యమంత్రి భూముల కోసం నాలుగు లైన్ల రోడ్లు రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్ ఉండగా మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. రూ. 5000 కోట్లు- ఖర్చుపెట్టి 10 లైన్ల రోడ్డు ఎందుకు వేస్తున్నావ్. ఉద్యోగులకు పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెబుతూనే రూ. 5000 కోట్లతో అత్తగారి ఊరికి రోడ్లు వేస్తారా? అని ప్రశ్నించారు. జానారెడ్డి గారిని ఆదర్శంగా తీసుకోండి అన్నారు సీఎం. ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వాలని కోరితే వెంటనే కేసీఆర్ వచ్చారు. మీరు కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వండని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములమ్మితే బొంద పెట్టడానికి కూడా స్థలం మిగలదు అని చెప్పి.. ఈరోజు అసెంబ్లీ సాక్షిగా భూముల అమ్మకాన్ని సమర్ధిస్తున్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాడి కాపాడింది.. మీరు అధికారంలోకి వచ్చాక కోర్టు తీర్పు వచ్చిందని, వాటిని కాపాడకుండా అమ్మితే ఎలా అన్నారు.

# ఆ మంత్రి పదవి కోసం నలుగురు పోటీ..!

(మొదటి పేజీ తరువాయి)

పదవికి పోటీ విపరీతంగా ఉంది. మంత్రి పదవి రేసులో ముందుగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు వినిపిస్తుండగా... మల్‌రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. అయితే.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. తనకు మంత్రి ఖాయమని భావిస్తున్న రాజగోపాల్‌రెడ్డి... తనకు హోంశాఖ అంటే ఇష్టమని... ఆ పదవికి ఇస్తే బాగుంటుందని మనసులో మాట కూడా బయటపెట్టేశారు. ఇక.. మల్రెడ్డి రంగారెడ్డి. ఆయన కూడా మంత్రి పదవి కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. మంత్రి పదవి ఇవ్వకపోతే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమే అని ఆయన హెచ్చరించారు. సుదర్శన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి కూడా... పార్టీపై ఒత్తిడి పెడుతున్నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి వైపు మొగ్గుచూపుతారో తెలియాల్సి ఉంది.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగ పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే.. రాజగోపాల్‌రెడ్డి సోదరుడు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవిలో ఉన్నారు. ఇప్పుడు



రాజగోపాల్‌రెడ్డికి కూడా మంత్రి పదవి ఇస్తే.. ఒకే కుటుంబానికి రెండు మంత్రి పదవులు ఇచ్చినట్టు అవుతుంది. దీని వల్ల.. మిగిలిన వాళ్లు గోల పెట్టేస్తారు. వ్యతిరేకత వచ్చే ఛాన్స్ కూడా ఉంది. అయితే.. భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి... రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారట. ఆ హామీని నిలబెట్టుకోవాలని రాజగోపాల్‌రెడ్డి కోరుతున్నారు. కేబినెట్ విస్తరణలో ఆయనకు మినిస్ట్రీ ఖాయమైందని కూడా వార్తలు వస్తున్నాయి. మరి... రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే... ఎదురయ్యే సమస్యలను కాంగ్రెస్ ఎలా హ్యాండిల్ చేస్తుంది.. అసంతృప్తులను ఎలా బుజ్జగిస్తుంది.. అనేది చూడాలి.

# అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

### కేటీఆర్ వర్సెస్ భట్టి

### కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు

### నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు.

# బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్

బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరకదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్ ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోందన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్కలేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సిఎం మండిపడ్డారు. పెట్టుబడుదారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం దివాళా తీస్తేనే మంచిదనేటట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత ఏక్కడైన గొడవలు జరిగాయా? అని రేవంత్ ప్రశ్నించారు. ఈ క్రమంలో జూదాల పట్ల కఠినంగా ఉండాలని అనుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. విమర్శల జోలికి పోను.. ఆన్‌లైన్ రమ్మి.. బెట్టింగులపై కఠినంగా ఉంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో ఆ÷-లనైన్ బెట్టింగులుపై చట్ట సవరణ చేస్తామన్నారు. గుట్కా నిషేధిత పదార్ధాలు మార్కెట్లో కి వచ్చాయి. వీటిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని పిలిచి విచారిస్తున్నాము. దానితో పరిష్కారం కాదు. బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారు.. బాధ్యులను కూడా




విచారించాలన్నారు. దీనికోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీ-ం వేస్తున్నాం. ప్రకటనలు చేసినా.. నిర్వహణలో భాగస్వామ్యం ఉన్న.. కఠినంగా వ్యవహారం ఉంటుందని సభలో సిఎం రేవంత్ ప్రకటించారు. నేరాలు చెప్పి జరగవు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటుంది ప్రభుత్వం. న్యాయవాదుల హత్య.. వెటర్నరీ డాక్టర్ హత్యలు గతంలో చూశాం. నడి బజారులో న్యాయవాదులను చంపిన వారిపై సీబీఐ విచారణకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుప్రీం కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు. ఆరేళ్ల అమ్మాయిని సైదాబాద్ లో చంపితే అనాడు సర్కార్ పట్టించుకోలేదు. జూబ్లీహిల్స్ లో మైనర్ బాలిక రేప్ కేసు.. దాంట్లో బీఆర్ఎస్ నాయకుడు ముద్దాయి. మాజీమంత్రి కొడుకుపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనల్లోని బాధితుల పట్ల సానుభూతితో ఉండాలి. కానీ ప్రతిపక్షం.. ప్రభుత్వమే చేయిస్తుంది అన్నట్టు మాట్లాడు తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇకపోతే ధరల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. 85 శాతం సొంత పన్నుల వసూళ్లతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. కడుపునిండా విషం పెట్టుకొని ఎందుకు మాట్లాడుతారని ఘాటుగా స్పందించారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని అన్నారు. ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనేతలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహకరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను అని సీఎం పేర్కొన్నారు. మాకు తరతమ భేదాలు లేవని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.

# తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు కాపాడేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాంతి భద్రతలపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లు బాధితులకు వాపస్ ఇచ్చారు.. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు. ఆనాడు కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారు.. కానీ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మేం చేతల్లో చూపించామని అన్నారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులో ఈ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పోలీసులు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నారని.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. మంథనిలో అడ్వకేట్ దంపతుల మర్డర్ జరిగితే.. ఈ ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించిన తీరు అందరి చూశారని విమర్శించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇప్పుడు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులు మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని.. సైబర్ సెక్యూరిటీ యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే.. మన ట్రాఫిక్ నియంత్రణ బాగుందని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని అన్నారు.

# లోక్‌సభలో ప్రతిపక్ష గొంతు నొక్కే కుట్ర

### స్పీకర్ సభ నడిపే తీరు ఇది కాదు

### మీడియాతో విపక్షనేత రాహుల్

న్యూఢిల్లీ,మార్చి26(ఆర్ఎన్ఎ): లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పీకర్ ఓం బిర్లా తీరుపై మండిపడ్డారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని, ఇది అప్రజాస్వామికమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సభలో ఏం జరుగుతుందో నాకు తెలియదు. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వమని స్పీకర్‌ని ఎన్నిసార్లు అభ్యర్థించినా.. నాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదు. సభను నడిపే పద్ధతి ఇది కాదు. ఎలాంటి ఆధారాలు లేకుండా స్పీకర్ నా గురించి అసత్యాలు మాట్లాడుతున్నారు. సభను పదేపదే వాయిదా వేస్తున్నారు. ఇదంతా ఎందుకు? నేను మాట్లాడేందుకు లేచి నిలబడడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన లేచి వెళ్లిపోతున్నారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షసభ్యులకు మైక్ ఇవ్వాలి కదా. ఇవ్వడం లేదు. మేం ఏం చెప్పాలో అది చెప్పనివ్వడం లేదు. నేను ఏం చేయలేదు. నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఒక్కమాట మాట్లాడలేదు. 7-8 రోజులుగా నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడారు. ఆ సమయంలో నేను నిరుద్యోగం గురించి మోడీని ప్రశ్నించాలని అనుకున్నాను.

## ఉప ఎన్నికల ప్రచారంపై సిఎం ఘాటు వ్యాఖ్యలు

**బిఆర్ఎస్ బాటలో మేం నడవడం లేదన్న సిఎం రేవంత్**

**సిఎం వ్యాఖ్యలపై అసెంబ్లీలో బిఆర్ఎస్, ఎంఐఎం ఆందోళన**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడుతారని ప్రతిపక్ష బీఆర్ఎస్, ఎంఐఎం సభలో ఆందోళనకు దిగాయి. స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సీఎం సభలో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. వెంటనే కలగజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్షాల నిరసనలను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పు గురించి మాట్లాడలేదని.. కేవలం ఫిరాయింపుల విషయంలో గతంలో మాదిరిగానే వ్యవహరిస్తామని అన్నారని వివరణ ఇచ్చారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని.. ఉప ఎన్నికలు వస్తాయని బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే మాట్లారని శ్రీధర్ బాబు స్పష్టత ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యుడిషియరిని విమర్శించే హక్కు పార్లమెంట్‌లో కూడా ఉంటుందని అన్నారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అంతకుముందు సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజు ఉప ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఎలాంటి సంప్రదాయం ఉందో అదే సంప్రదాయాన్ని మేం ఫాలో అవుతున్నాం అన్నారు.

## కామారెడ్డి జిల్లాలో విషాదం

**టెన్త్ పరీక్షరాసి తండ్రి అంత్యక్రియలకు హాజరు**

**కామారెడ్డి, (క్రైమ్ మిర్రర్):** గుండెపోటుతో తండ్రి మరణించగా, ఆపుకోలేని దుఃఖంలోనూ ఆ తనయ పది పరీక్షలు రాసి, అంత్యక్రియలకు హాజరై, తర్వాత వచ్చి తండ్రి మృతదేహం పై పడి కూతుళ్లు గుండెల విసిలా రోదించిన తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేసింది. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన బీబీపేట సత్యనారాయణ (42) కామా రెడ్డి జిల్లా భిక్కనూరు మండలం వీ6 ఓ పత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నిన్న రాత్రి భోజనం చేసి పడుకోగా.. బుధవారం తెల్లవారుజామున నిద్రలోనే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, కూతుళ్లు కీర్తన, దీపిక, అనుష ఉన్నారు. జంగంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇద్దరు కూతుళ్లు చదువుతున్నారు. అయితే కీర్తనకు టెన్త్ క్లాస్ఎగ్జామ్ ఉంది. తండ్రి మరణించాడు అన్న విషయం తెలిసి, పుట్టెడు దుఃఖంలో కూడా పరీక్ష రాసేందుకు వెళ్లింది. పరీక్ష రాసిన వెంటనే తాను, తనతో పాటు- చెల్లెలు అనూషను వెంటబెట్టు-కొని, తమ బంధువుల ద్విచక్ర వాహనాలపై ఎక్కి, నస్కల్ గ్రామానికి చేరుకొని, తండ్రి మృతదేహం పై పడి డాడీ అంటూ గుండెల విసెలా రోదించడం చూసి పలువురు కంట తడి పెట్టు-కున్నారు.

## కోర్టు అంశాలను అసెంబ్లీలో ఎలా ప్రస్తావిస్తారు

**సిఎం వ్యాఖ్యలపై కెటిఆర్ అభ్యంతరం**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పార్టీ ఫిరాయింపులు, ఉప ఎన్నికలపై అసెంబ్లీ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డి ఆయన సీఎం అనే విషయం మర్చిపోతున్నారు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ వేదికగా తీర్పు ఇవ్వాలని యత్నం చేస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాలపై వ్యాఖ్యలు చేయవద్దని నిబంధనలు చెబుతున్నాయి.. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆ రూల్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. తాను నిబంధనలకు అతీతమని.. సుప్రీంకోర్టు కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలిని న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇకనైనా రేవంత్ రెడ్డి పాలనపై వ్యవహరించి పాలనపై దృష్టి సారించాలని.. సూచించారు.

## మాజీ సర్పంచ్ హత్య కేసులో నిర్లక్ష్యం

**సూర్యపేట డీఎస్పీ రవిపై వేటు**

**సూర్యాపేట, (క్రైమ్ మిర్రర్):** సూర్యపేట డీఎస్పీ రవిపై వేటు పడింది. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాలలో ఇటీవల జరిగిన గ్రామ మాజీ సర్పంచి మెంచు చక్రయ్య గౌడ్ మర్డర్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పోలీస్ ఉన్నతాధికారులు డీఎస్పీపై చర్యలు తీసుకున్నారు. ఆయనను డీజీపీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఐజీ సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహించిన తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ను బదిలీ చేయగా ఎస్ఐకి మెమో జారీ చేశారు. సూర్యాపేట ఇన్ చార్జ్ డీఎస్పీగా కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మార్చి 17 న సూర్యాపేట జిల్లాలో మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్యను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెన్చు చక్రయ్య మార్చి 21న ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వస్తూ గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ చక్రయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలానికి చేరుకొని చక్రయ్యను సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించగా ట్రీ-ట్‌మెంట్ తీసుకుంటూ చనిపోయాడు.మాజీ సర్పంచ్ చక్రయ్యగౌడ్ హత్య కేసును త్వరలో ఛేదిస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని మల్టీజోన్ -2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో హత్యకు గురైన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య కుటు-ంబ సభ్యులను ఎస్పీ నరసింహాతో కలిసి ఐజీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ హత్యలో సొంత బంధువుల హస్తం ఉన్నట్లు- గుర్తించామని, సొంత అల్లుళ్లే ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతుందని, ఏ ఒక్కరిని వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఇప్పటికే 9 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని వెల్లడించారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే

**కూకట్‌పల్లి సమస్యలపై ప్రస్తావన ..నిధుల విడుదలకు వినతి**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీల ఛాంబర్లో సీఎం రేవంత్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. నూతన రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి నూతన పైప్ లైన్ ల నిర్మాణం, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం పనులకు) సుమారుగా రూ. 25-30 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయాలని కోరారు.అదే విధంగా కూకట్‌పల్లి మండలం పరిధిలోని హైదర్‌నగర్ గ్రామం సర్వే నెంబర్ 145,163 లలో నిర్మాణ అనుమతులను నిలిపివేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దశాబ్దాల కాలంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా గానీ ప్రభుత్వపరమైన అన్ని అనుమతులను జారీ చేశార చెప్పారు.

# భూభారతిపై వాడీవేడి చర్చ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శించారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించిదన్నారు. కానీ బిఆర్ఎస్ ధరణిపేరుతో సామాన్యుల భూములను కాజేసిందని అన్నారు. వారికి భూమిపై హక్కులు లేకుండా చేసేందుకు ధరణిని తీసుకుని వచ్చారని, ఎందరో భూములు మాయమయ్యాయని అన్నారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పాం.. వేసి చూపామని అన్నారు. అందుకు ప్రత్యమ్నాయంగా 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొచ్చి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. వీఆర్ఏ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తామని.. వీఆర్ఏలు కావాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడించారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అని పొంగులేటి చెప్పారు. ధరణి పోర్టల్ పై ప్రజలు తీర్పు ఇచ్చారు.. మా సభ్యులే కాదు.. మీ వైపు ఉన్న సభ్యులు కూడా ఇబ్బంది పడ్డారు.. ధరణిలో ఏర్పడిన సమస్యలతో తమ భూముల సమస్యలు పరిష్కారం కోసం నా దగ్గరికి పలువురు ఎమ్మెల్యేలు వస్తున్నారు వెల్లడించారు. మేము వచ్చే ఎన్నికల్లో భూ భారతి గురించి చెప్పి ఎన్నికలకు పోతాం.. బీఆర్ఎస్ ధరణి పేరుతో ఎన్నికలకు వెళ్తారా? అని ప్రశ్నించారు. మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు.. ధరణి తెచ్చి రూల్స్ అసలు ఫ్రేమ్ చేయలేదు.. మేము చట్టం తెచ్చి రూల్స్ సిద్ధం చేస్తున్నాం.. మీరు మాకు చెప్పడం ఎందుకు అని ప్రశ్నించారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

## కాళేశ్వరం ఎలా వినియోగించాలో చూపిస్తాం

**చేతగాకపోతే తప్పుకోవడం మేలు**

**దోచుకోవడం..దాచుకోవడం కాంగ్రెస్ నైజం**

**ఎండిన పంటపొలాలను పరిశీలించిన జగదీశ్ రెడ్డి**



**సూర్యాపేట,(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి ఏమి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. బుధవారం చివ్వెంల మండలం మొగ్గాయగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ నేతలతో కలిసి జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సోయిలేకుండా ప్రవర్తిస్తోందని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ తీసుకున్నడు.. కానీ దానిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. పాలన చేతగాక పోతే మాకు అప్పగించండి.. కాళేశ్వరం నీటిని ఏ విధంగా విడుదల చేయాలో చేసి చూపిస్తామని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ అద్భుతమైన ప్రణాళికతో తెలంగాణను భారతదేశంలోనే నెంబర్ వన్‌గా చేశాడని.. కాంగ్రెస్ వచ్చాక ఆర్థిక రంగం మొత్తం కుదేలై వెనకబడే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాది ప్రజల ఖజానాకు రావాలసిన రూ.15 వేల కోట్ల డబ్బులు మీ జేబుల్లోకి పోయిందని స్పష్టంగా అర్థమవు తుందని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ పడ్డ పదేళ్ల కష్టం నామరూపల్లె లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తే సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ తెలంగాణను నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రభుత్వం సాగునీరు ఇస్తే కొన్ని పొలాలైనా చేతికొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించి తక్షణమే రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం.. చివరి పంటకు సాగుకైన నీటిని విడుదల చేయాలన్నారు.

## కెసిఆర్ హయాంలో విద్యావ్యవస్థ మెరుగు

**కేంద్రగణాంకాలే ఇందుకు నిదర్శనం**

**మండలిలో ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ శాసనమండలిలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీ కవిత ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ నాశనం అయిందని ప్రచారం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ గణాంకాలే సమాధానమని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన గణాంకాల ప్రకారం, గత పది సంవత్సరాల్లో తెలంగాణలో విద్యా వ్యవస్థ మెరుగుపడింది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య తగ్గిందని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని కవిత వ్యాఖ్యానించారు. 2014-15 నాటికి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 29,268 కాగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 30,022కి పెరిగింది.

## భద్రాచలంలో కుప్పకూలిన ఆరందతస్థుల భవనం

(మొదటి పేజీ తరువాయి)

**భద్రాద్రి కొత్తగూడెం,(క్రైమ్ మిర్రర్):** భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారిపోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఇంటి యజమాని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మిస్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పిస్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.నాశిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అంటున్నారు. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది పంచాయతీ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఒకవేళ భవనం ప్రారంభోత్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలిలాల కింద ఎంతమంది ఉన్నారనేది తొలగింపు తరవాత బయటపడనుంది. నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

## ఎడిటోరియల్



# జాతీయ జలవిధానంపై స్పష్టత రావాలి

**వే**సవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయారాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని మున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. అలాగే కాళేశ్వరం పూర్తయితే తెలంగాణ కూడా సస్యశ్యామలం కాగలదు. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కలు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. బ్రిజేష్ ట్రిబ్యునల్ లో కౌంటర్ దాఖలు చేయడం ద్వారా కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. బ్రిజేష్ ట్రిబ్యునల్ అవలంబిస్తున్న ధోరణి, అది చేపట్టిన విచారణ మొదటి నుంచీ ఎగువ రాష్ట్రలకు అనుకూలంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేకంగా సాగింది. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి.

ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపై తన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది.



# కానరాని ఆర్థిక పునరుత్తేజం !

ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నలు మీద ఉన్న శ్రద్ద మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. డిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి. బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్ధికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్తిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరరంగం గాడిన పడదు.

(ఆధ్యాత్మిక చింతన)

## సకల్ల జీవరాశుల సంక్షేమం

ప్రతి రోజూ– తనకు సంబంధం లేని మనిషి క్షేమం కోరి హృదయపూర్వక ప్రార్థన చేసే వ్యక్తికి అదే ఆరోగ్యం, ఆనందం! వాటి కోసం అతడు ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. అలా ప్రార్థన చేస్తున్నప్పుడే, శరీరంలో మార్పులు కలుగుతాయి. మనసులో చక్కటి భావ ప్రకంపనలు ఏర్పడి, ధ్యానంగా మారి, రోగాల్ని దూరం చేస్తాయి. ఇది యోగుల బోధ.సర్వుల హితం కోరడంలో ప్రేమ ఇమిడి ఉంటుంది. ఎవరి కోసం వారే ఉంటే, ఆ జీవితం నిష్ఫలం. దానికి ప్రాముఖ్యం, అర్థం ఉండవు. మనిషి జీవితం ఏ క్షణం నుంచి ఇంకొకరి కోసం సాగుతుందో, ఆ క్షణం నుంచే సేవాభావం వెలుగొందుతుంది. సేవ కేవలం హృదయానికి సంబంధించినదై ఉండాలి. దాన్ని ఆలోచనలు, మాటలు అనుసరించాలి. ఆలోచనను హృదయం ఎప్పుడూ మంచి దారిలోనే నడిపిస్తుంది. హృదయం ఒక దిక్సూచి. ప్రేమకు అది కేంద్రస్థానం. సేవ, ప్రేమల్ని మనిషి కళలుగా నేర్చుకోవాలి. అదే సమగ్ర జీవిత కళ. అహంకారాన్ని విడనాడాలి. ఉపనిషత్తులకు ప్రాధాన్యాల పట్టిక ఉంది. అందులో అన్నింటికన్నా ముందు ఉండేది మానవత్వమే.సకల జీవరాశులూ చల్లగా ఉండాలన్న భావన పెరిగేకొద్దీ, మనిషి అసలైన ఆనందానికి అర్థం తెలుసుకుంటాడు. అటువంటి నామస్మరణ ఉన్న చోట, మంచి వెల్లివిరుస్తుంది. అప్పుడే రుషులు సంతోషిస్తారని, దేవతలు దీవిస్తారని ఉపనిషత్ వాక్యం!

# పెట్రోల్, డీజిల్‌లను జిఎస్టీ పరిధిలోకి తేవాలి

**ఎక్సైజ్ సుంకాలు తగ్గించుకోవాల్సిందే.. పన్నులపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి**




డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం

**ప**న్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజెల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజెల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుం టున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జిఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్దతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 27-3-2025


# ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి

**ఈ దిశగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులకు సూచించారు**





బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎండల తీవ్రత దృష్ట్యా చేసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ, రాష్ట్రం లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతల నమోదు జిల్లాలలో పెద్దపల్లి మూడవ స్థానంలో ఉందని , ప్రజలు వడ గాల్పుల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల శరీరంలో నేటి శాతం తక్కువైతే ప్రజలకు వడ దెబ్బ తగిలే అవకాశం అధికంగా ఉంటుందని, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమమని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనుల పని వేళలు మార్చాలని అన్నారు.ఆశా కార్యకర్తల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరి వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలో జరిగే వివిధ పంట కొనుగోలు నేపథ్యంలో రైతులకు, హమాలీ కూలీలకు, అక్కడి సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన టెంట్, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నీటి పారుదల శాఖ, పంచాయతీ, వివిధ శాఖల కింద జరిగే పనులు దగ్గర కార్మికులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చల్లి వేంద్రం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అదనపు సూచించారు. గతంలో అధికంగా ఫీవర్ కేసులు నమోదైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చి వేత కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఇంటిలో పాత కూలర్లు టైర్ల లో నీటి నిల్వలను తీసి వేయాలని అన్నారు. గ్రామాలలో రెగ్యులర్ ఫాగ్గింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారుఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

**కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పిఎస్ ఆంజనేయులు**



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ముజాహిద్ పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సుల్తాన్పూర్ బాలరాజు తల్లి అనారోగ్యంతో బుదవారం మరణించారు. పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి కుటుంబాన్ని పరామర్శించి ఆమె అంత్యక్రియల నిమిత్తం ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాలరాజుకు అందించారు.ఈ కార్యక్రమంలో ముజాహిద్పూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర భూపాల్, యువ నాయకులు గుండా.బాలకృష్ణ,జిల్లెల్ల చంద్రయ్య కండక్టర్,దాసరి.అంజి శివకుమార్,సోమలింగం, కాంగ్రె స్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు

జిల్లా పాస్టర్స్ ఫెల్లోషిప్ గౌరవ అధ్యక్షులు ఏసుదాసు పస్కా ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు వి సుదర్శన్, పరిగి నియోజక వర్గ పస్కా ఫెల్లోషిప్ అధ్యక్షులు జి డానియల్ రాజ్ క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని వికారాబాద్ జిల్లా పాస్టర్స్ ఫెల్లోషిప్ గౌరవ అధ్యక్షులు బిసెప్ ఏసుదాసు, పరిగి పస్కా పిల్లోసిప్ గౌరవ అధ్యక్షులు పాస్టర్ వి.సుదర్శన్, పరిగి నియోజకవర్గ పస్కా పెల్లోసిప్ అధ్యక్షులు పాస్టర్ జి.డానియల్ రాజ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఈ సంఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు తెలుగు రాష్ట్రాలలోని క్రైస్తవ పాస్టర్లపై విశ్వాసులపై పునరావృతం కాకుండా ప్రభుత్వం భద్రత కల్పించాలని వారు సూచించారు.



## ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత చిత్రపటానికి క్షీరాభిషేకం

**కూకట్ పల్లి,మార్చి 26 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా చిత్రపటానికి జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం లో క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంలో పేద వైశ్యులను భాగస్వామ్యం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చేర్చించి ఈడబ్ల్యూఎస్ ద్వారా పథకంలో దరఖాస్తు చేసేందుకు కృషిచేసిన సుజాత చిత్రపటానికి బుధవారం నాగరాజు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా అధ్యక్షతన వైశ్య సోదరులు క్షీరాభిషేకం నిర్వహించి ఆర్యవైశ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు . కార్యక్రమంలో ,ప్రధాన కార్యదర్శి తెరల శ్రీనివాస్ లెన్స్కర్ కాపర్తి నాగరాజు,దొంతుల అన్నయ్య,ఎర్రం ప్రవీణ్,టెంపుల్ చైర్మన్ రేగూరి ప్రవీణ్,అంగడి సత్యనారాయణ,సతీష్,శ్రీనివాస్,స్వామి,శ్రీధర్,కనుకయ్య,లింగ వేణుగోపాల్,గోలి రాజయ్య,శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన అధికారులు

నిజంసాగర్ క్రైమ్ మిర్రర్ : కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామంలో నూతన సిసి రోడ్డు పనులను బుధవారం పరిశీలించిన డిప్యూటీ ఈఈ ప్రభాకర్,నిజాంసాగర్ మండల ఎంపీడీవో గంగాధర్.నూతన సిసి రోడ్డు పనులను నాణ్యతతో చేయాలని సదరు కాంట్రాక్టర్ కు అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే.మల్లికార్జున్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ధర్మ భిక్షం గౌడ్ వర్ధంతి వేడుకలు



చౌటుప్పల్, మార్చి 26, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ 14వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొని ధర్మ భిక్షం గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గౌడ సంఘానికి ధర్మ బిక్షం గౌడ్ చేసిన సేవలను కొనియాడారు. ధర్మ బిక్షం గౌడ్ అందించిన స్ఫూర్తి నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్, గౌడ సంఘం నాయకులు బత్తుల లక్ష్మయ్య గౌడ్, తొర్పునూరి వెంకటేష్ గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, తొర్పునూరి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సందగళ్ల విజయ సతీష్ గౌడ్, బొడిగె బాలకృష్ణ, ఉడుగు మల్లేష్ గౌడ్, మారగోని అశోక్ గౌడ్, చెరుకు లింగస్వామి గౌడ్, తొర్పునూరి రవి గౌడ్, ఉష్కాగుల నాగరాజ్ గౌడ్, తొర్పునూరి లింగస్వామి, చేవగోని మహేష్ గౌడ్, మామిడి శివ, ఊడుగు రమేష్, పల్చం కిరణ్, చెరుకు అశోక్, కాసుల వెంకటేష్, మునుకుంట్ల జంగయ్య, చింతకింది గణేష్, వర్కాల రవి, ఊడుగు కృష్ణ గౌడ్, గుండు రాజు, అంతటి రాజేష్, మొగుదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బైకు అదుపు తప్పి కిందపడి బాలుడు మృతి



నూతనకల్ (క్రైమ్ మిర్రర్): బైకు అదుపుతప్పి స్కిడ్ కావడంతో బైక్ పై ఉన్న బాలుడు కిందపడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం జరిగింది. నూతనకల్ ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు ఎస్ మండలం ఏపూర్ గ్రామానికి చెందినకల్లేపల్లి పవన్(బైక్ నంబర్ AP 20 AK 7790) పై అతని బావమరిది లింగంపల్లి గ్రామానికి చెందిన బొప్పని రిషి( 10 సం)ని బైకు వెనకాల కూర్చోబెట్టుకొని లింగంపల్లి నుండి చిన్ననేమీల ఎక్స్ రోడ్డు వైపు వెళ్తుండగా మిర్యాల చెరువు కట్ట దాటగానే పవన్ నడుపుతున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పై స్కిడ్ అయి పడటంతో బైక్ వెనకాల కూర్చున్న రిషి రోడ్డు పై పడటం వలన తలకు బలమైన గాయం కారణంగా రక్తస్రావం కాగా సూర్యాపేట జనరల్ హాస్పిటల్ కు తరలించగా మార్గమధ్యంలోనే బాలుడు మృతి చెందాడు. మృతుడు రిషి తల్లి సుజాత పిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా బైక్ నడిపిన కల్లేపల్లి పవన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.


## విద్యుత్ షాక్ తో యువకుని మృతి



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** విద్యుత్ శాఖకు గురై యువకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి గ్రామానికి చెందిన కారంగుల లక్ష్మణ్ (23) గ్రామంలో హెల్పర్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం గ్రామంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ ను ఆప్ చేసి విద్యుత్ స్తంభం ఎక్కగా కరెంట్ షాక్కు గురై కింద ఉన్న సిసి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలో వెళ్ళాడు.గమనించిన స్థానికులు వెంటనే సూర్యాపేటకు తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు.మృతుడుతుంగతుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కారింగుల ఏక సాయిలు ఏకైక కుమారుడు. యువకుని మరణ వార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కలిసిన మారుతీ కిరణ్ బూనేటి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాను ఢిల్లీలోని ఆయన నివాసంలో బిజెపి పార్టీ పరిగి నియోజకవర్గ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తో బుధవారం మర్యాదపూర్వకముగా కలిశారు.తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను వారితో చర్చించి ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వారికి వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పూర్తిగా విఫలమైందని తెలియజేశారు. ఇప్పటికే ప్రజలు బిఆర్ఎస్ కి రెండుసార్లు, కాంగ్రెస్‌కు ఒకసారి అవకాశమిచ్చిన తర్వాత, ఇప్పుడు భాజపాను ఒక బలమైన ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని ఇటీవల రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు సాధించడమే ప్రజలు భాజపాపై చూపిస్తున్న విశ్వాసానికి స్పష్టమైన సంకేతమని తెలిపారు.



# టి యు డ బ్ల్యూ జె మునుగోడు నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా నక్క శ్రీనివాసు ...



క్రైమ్ మిర్రర్,నాంపల్లి: నాంపల్లి మండలంలోని దామెర గ్రామానికి చెందిన నక్క శ్రీనివాస్ నాంపల్లి ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ గా పనిచేస్తున్నాడు. బుదవారం నాడు చండూరు మండల కేంద్రంలో నిర్వహించిన నల్లగొండ జిల్లా తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ టి యు డ బ్ల్యూ జె సమావేశంలో మునుగోడు నియోజకవర్గ గౌరవ అధ్యక్షునిగా మహేశ్వరం సతీష్, అధ్యక్షునిగా రాపోలు చండూర్ కు చెందిన రాపోలు ప్రభాకర్ ఎన్నిక కాగా, నియోజకవర్గ ఉపఅధ్యక్షుడి గా నాంపల్లి మండలంలో ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ గా పనిచేస్తున్న మండలంలోని దామెర గ్రామానికీ చెందిన నక్క శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా



కార్యదర్శిగా నాగయ్య, గాలేంక వినోద్ కుమార్, గొల్ల బోయిన వెంకటయ్య, కామిషెట్టి యాదయ్య, కొండ్రెరెడ్డి ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ద్వారా వాస్తవాలు వస్తాయి: ఎండి వాజిద్



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రములో సర్వే నంబర్ 266 లు కొనుగోలు చేసిన భూమిపై కొందరు 2020 లో కోర్టులో కేసులు వేయడం జరిగిందని, అట్టి భూమిపై వస్తున్న దుష్ప్రచారం అవస్తావమని ఎండి వాజీద్ అన్నారు.కోర్టు ద్వారా త్వరలో వాస్తవాలు వస్థాయన్నారు .

## టియుడబ్ల్యూజే మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా శ్యామ్ సుందర్ రెడ్డి

### మునుగోడు జర్నలిస్టులకు ప్రధాన్యత



మునుగోడు క్రైమ్ మిర్రర్ : చండూరు మండల కేంద్రములో నిర్వహించిన తెలంగాణ యూనియన్ అప్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మునుగోడు నియోజకవర్గ కమిటీని నియమించడం జరిగింది.. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ముడుపు శ్యామ్ సుందర్ రెడ్డి ఆంధ్రజ్యోతి, నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా జాజుల స్వామి గౌడ్ , దిశ, సహాయ కార్యదర్శిగా దొమ్మాటీ కృష్ణ ప్రజాపక్షం , ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళలు ఉద్యోగం చేసినపుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది - బలుసు మురళీ కృష్ణ






**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** ఖమ్మం నగరంలో విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ వేదికగా టాటా ఎక్సెల్సి సౌజన్యంతో సమర్ధానం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు కొనసాగిన ఉచిత కంప్యూటర్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ధ్రువపత్రాలను అందచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువ నాయకులు సంతోష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలుసు మురళీకృష్ణ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బలుసు మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలంటే వృత్తి నైపుణ్యత శిక్షణ చాలా అవసరం అని కంప్యూటర్ శిక్షణతో విజయాలు సాధించవచ్చని అన్నారు. మహిళలు ఎలాంటి క్లిష్ట పరిస్థితులను అయినా ఎదుర్కోవాలి అంటే ఉద్యోగంతోనే అది సాధ్యమవుతుందన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. సమర్ధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు బ్యాచ్ లు ముగించడం మహిళలకి ఉచిత శిక్షణతో చేయూతను అందించడం పట్ల నిర్వాహకులను విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగనబోయిన సతీష్, సమర్ధానం దివ్యంగుల సంస్థ ప్లేస్ మెంట్ ఆఫీసర్ వెంకట రమణ, విట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోడిరెక్క ఉమా శంకర్, అవులూరి సౌమ్య మేనేజర్ కల్లెపు అఖిల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆశాజ్యోతి బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్: పల్లె శేఖర్ రెడ్డి



చౌటుప్పల్, మార్చి 26, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి): పేద ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ ధర్మ బిక్షమని సిపిఐ చౌటుప్పల మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం స్వాతంత్ర సమరయోధులు నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు ధర్మభిక్షం 14వ వర్ధంతి సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని తంగేడుపల్లి రోడ్ లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పర్యాయాలు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అదేవిధంగా దున్నేవానికి భూమి కావాలని, గీసేవానికే చెట్టు కావాలని, పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని తెలిపారు. ముఖ్యంగా రాచకొండ గుట్టల్లో ఏర్పాటు చేయదలచిన ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేసి రద్దు చేయించిన ఘనత ధర్మ బిక్షందే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, గీత పని వాళ్ళ సంఘం నాయకులు నీళ్ల బిక్షపతి, టంగుటూరి రాములు, పిల్లి శంకర్, రండి నరసింహ, బత్తుల సుధాకర్, దాసరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బొబ్బిళ్ళ కనకయ్య-లక్ష్మమ్మ 35వ వర్ధంతి వేడుకలు

### అమ్మ నాన్న అనాథ ఆశ్రమంలో అనాథ లకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం



చౌటుప్పల్, మార్చి 26, (క్రైమ్ మిర్రర్ న్యూస్ ప్రతినిధి): చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన బొబ్బిళ్ళ కనకయ్య-లక్ష్మమ్మ 35వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు మనవరాళ్లు చౌటుప్పల పట్టణ కేంద్రంలోని అమ్మ నాన్న అనాథ ఆశ్రమంలో సుమారు 600 మంది అనాథ లకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా నాన్న, అమ్మ 35వ వర్ధంతి సందర్భంగా అనాథ లకు అన్నప్రసాదాలను వితరణ చేయడం మా పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిళ్ళ కనకయ్య కుమారులు బొబ్బిళ్ళ శ్రీరాములు, బొబ్బిళ్ళ ధణేష్, బొబ్బిళ్ళ వెంకటేశం, వారి మనవళ్లు బొబ్బిళ్ళ కాళేశ్వర్, బొబ్బిళ్ళ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయంలెక్కింపు

**పెద్దపెల్లి జిల్లాకమాన్ పూర్, మండలం క్రైమ్ మిర్రర్ బ్యూరో న్యూస్.మార్చి 27:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయం భూ క్షేత్రమైన ఆదివరాహస్వామి హుండీ ఆదాయం బుధవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది అక్టోబర్ మాసంలో హుండీ ఆదాయం లెక్కించగా ఆరు నెలల అనంతరం హుండీ ఆదాయం లెక్కింపు చేశారు. ఈ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం పెద్దపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొసన కాంతారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయం ? 5,15,694 వచ్చినట్లు వెల్లడించారు. ఈ హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఆసక్తిగా మారిన కూనంనేని వ్యాఖ్యలు

### టూరిజంను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలలో చర్చకు దారితీశాయి. ఆయన ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురించి చేసిన వ్యాఖ్యలు విపరీతంగా ఆకర్షించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. 'ఏ ఇజం లేదు.. టూరిజమే ముఖ్యం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు అప్పట్లో కోపాన్ని కలిగించినప్పటికీ.. పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే.. ఖర్చు లేనిది ఏదైనా ఉంది అంటే అది టూరిజమే అని అన్నారు.

# తెలంగాణలో నిరుద్యోగులకు వరంగా యువ వికాసం

### వందశాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్లు

హైదరాబాద్,: తెలంగాణ రాష్ట్రంలో యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం సహాయం చేయడానికి ప్రభుత్వం వివిధ చర్యలను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు మండలాలు, సంక్షేమ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్లకు 100 శాతం రాయితీ కల్పిస్తారు. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విధివిధానాలు ఇలా ఉన్నాయి. కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు.. దీనిలో వితంతు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్నవారికి.. స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సంబంధిత పత్రాలను జతచేసి మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలి. ఇటువంటి పథకాల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయల కుటుంబ ఆదాయం, పట్టణాల్లో 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వారు ఈ పథకంలో భాగస్వామి కావచ్చు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు కొన్ని ముఖ్యమైన పత్రాలు జతచేయాలి. వాటిలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఎంపికైన వారికి 15 రోజుల పాటు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత యూనిట్లను మంజూరు చేసి.. అవసరం అయిన వారికి సహాయం చేస్తారు. ఇక యూనిట్ గ్రౌండ్ చేసిన వారికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు నిపుణుల ఆధ్వర్యంలో సాంకేతిక శిక్షణ ఇస్తారు. వ్యవసాయం కాకుండా ఇతర పథకాలకు దరఖాస్తు చేసిన వారి వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు అయితే 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారు. తర్వాత ఏప్రిల్ 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. జూన్ 2 తర్వాత అర్హులకు మంజూరు పత్రాలు జారీ చేస్తారు.



## విమానయానంలోకి కొత్తగా 3 సంస్థలు

న్యూఢిల్లీ, మార్చి 26: ఒకవైపు ఆర్థిక నష్టాలతో కాలం వెళ్లదీస్తున్న విమానయాన సంస్థలు..మరోవైపు కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశించడానికి ఉవ్విళ్లూరుతున్నాయి మరో మూడు సంస్థలు. దేశీయ విమానయాన రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ ఏడాది కొత్తగా శంఖ్ ఎయిర్, ఎయిర్ కేరళ, అల్‌హింద్ ఎయిర్‌లు తమ విమాన సర్వీసులను ప్రారంభించబోతున్నాయి. వీటికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్‌ఓసీలు) మంజూరయ్యాయి. కానీ డైరక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికేట్‌ల కోసం వేచి చూస్తున్నాయి. ఈ సర్టిఫికేట్ జారీ అయిన వెంటనే విమాన సర్వీసులు ప్రారంభించనున్నాయి.

# పసిడి ధర మళ్లీ పెరిగింది..!

ఎ బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. రికార్డు స్థాయికి ధరలు చేరగా.. ఇటీవల వరుసగా నాలుగు రోజులు తగ్గుతూ వచ్చి ఊరటనిచ్చాయి. తాజాగా బుధవారం మార్కెట్‌లో ధర మళ్లీ పెరిగింది. రూ.235 పెరిగి తులం ధర రూ.రూ.90,685కి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం ప్యూరిటీ బంగారం 10 గ్రాములకు రూ.235 పెరిగి రూ.90,235కి చేరింది. ఇటీవలి నష్టాల తర్వాత రిటైలర్లు తాజాగా కొనుగోలు చేయడంతో పసిడి ధరలు పెరిగినట్లుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో బలమైన ట్రెండ్ కారణంగా సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఇక వెండి ధర రూ.1,500 పెరిగి కిలోకు రూ.1,01,500కి చేరింది. మరో వైపు ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.16 శాతం పెరిగి ఔన్సుకు 3,024.96 డాలర్లకు చేరింది. పెట్టుబడిదారుల డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి గోల్డ్‌కి డిమాండ్, ఈటీఎఫ్‌ల నుంచి బలమైన ఇన్‌ఫ్లో కారణంగా బుధవారం బంగారం స్వల్పంగా పెరిగింది. ఇక ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించనున్నారు. యూఎస్ సుంకాల నిర్ణయంపై అనిశ్చితి కారణంగా బంగారానికి మద్దతు లభిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ (కమోడిటీస్) విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. సెక్యూరిటీస్, కమోడిటీ అండ్ కరెన్సీ, రీసెర్చ్ అనలిస్ట్-వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ ఈ వారం చివరలో విడుదలకానున్న యూఎస్ జీడీపీ, కోర్ పర్సనల్ కన్స్యూమ్ ఎక్స్‌పెన్షన్ ప్రైస్ ఇండెక్స్‌తో సహా కీలకమైన స్థూల ఆర్థిక డేటా కోసం మార్కెట్‌కు చెందిన వారంతా ఎదురు చూస్తున్నారన్నారు.



## ప్రియమైన వారి గుండె చప్పుడు వినిపించే.. లవ్ లాకెట్

ప్రేమికులు తరచు చెప్పుకునే మాట.. 'నా హృదయ స్పందన నువ్వేనని'. మరి ఇప్పుడు మీ ప్రియమైన వారి గుండె చప్పుడును ఎల్లప్పుడూ మీరు వినేందుకు వీలుగా రూపొందించినదే ఈ లాకెట్. ఇదొక లవ్ లాకెట్. దీనిని ధరించిన వారు తమ గుండె చప్పుడును తమ ప్రియమైన వ్యక్తితో పంచుకోవచ్చు.ఇందుకోసం రెండు లాకెట్లను నేరుగా ఇద్దరు వాడుకోవచ్చు. ఒకరి వద్దే లాకెట్ ఉంటే, మొబైల్ యాప్‌లో వారి కాంటక్ట్‌ను సేవ్ చేసుకొని వాడాలి. లాకెట్‌లో ఉండే బటన్‌ను నొక్కినప్పుడు, మీరు ఎంచుకున్న వారికి మీ గుండె చప్పుడు ఆడియోను చేరవేస్తుంది. ధర రూ. పది నుంచి ఇరవై వేల వరకు ఉంది. వివిధ రంగుల్లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది.

# ఎక్కువ వడ్డీ అందించే పోస్టాఫీస్ స్కీమ్

## ఎలా అప్లై చేయాలంటే?




మహిళలు, బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' ఒకటి. ఈ పథకాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ 2023 జూన్ 27న ప్రారంభించింది. ఇది ఈ నెల చివరి నాటికి క్లోజ్ అవుతుందని తెలుస్తోంది. ఇంతకీ ఈ పథకానికి అర్హులు ఎవరు?, ఎలా అప్లై చేయాలి? అనే వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.

**మీూజ స్కీమ్ కోసం ఎవరు అర్హులు**

- ఈ పథకం కోసం అప్లై చేసుకోవాలనుకునేవారు భారతీయులే ఉండాలి.
- ఈ స్కీమ్ కేవలం స్త్రీలకు మాత్రమే.
- వ్యక్తిగతంగా ఈ పథకానికి అప్లై చేసుకోవచ్చు. మైనర్ ఖాతా అయితే తండ్రి / సంరక్షకులు ఓపెన్ చేయవచ్చు.
- గరిష్ట వయోపరిమితి లేదు, కాబట్టి ఎవరైనా మహిళలు అప్లై చేసుకోవచ్చు.

**ఎలా అప్లై చేసుకోవాలి?**

- మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్ కోసం అప్లై చేసుకోవాలనుకునేవారు.. సమీపంలో ఉండే పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ లేదా ఈ ఫథకం ఉన్న బ్యాంకులో అప్లై చేసుకోవాలి.
- ముందుగా అధికారిక వెబ్‌సైట్ నుంచి ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన వివరాలను ఫిల్ చేసిన తరువాత.. కావలసిన డాక్యుమెంట్స్ జతచేయాల్సి ఉంటుంది.
- ఎంత డిపాజిట్ చేస్తారో ధరఖాస్తులోనే వెల్లడించాలి (రూ. 1000 నుంచి రూ. 2 లక్షల వరకు).

**అప్లై చేయడానికి అవసరమైన డాక్యుమంట్స్**

- మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకానికి అప్లై చేసుకోవడానికి.. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డిపాజిట్ చేసే మొత్తం లేదా చెక్, అడ్రస్ ప్రూఫ్ కోసం పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ వంటి డాక్యుమెంట్స్ అవసరం.


**పెట్టుబడి ఎంత పెట్టాలి? వడ్డీ ఎంత వస్తుంది**

- మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంలో రూ. 1000 నుంచి రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం గడువు రెండేళ్లు. ఇందులో వడ్డీ 7.5 శాతం ఉంటుంది. అంటే మీరు ఇప్పుడు ఈ స్కీమ్ కింద ఇన్వెస్ట్ చేస్తే.. రెండు సంవత్సరాల తరువాత అసలు, వడ్డీ కలిపి తీసుకోవచ్చు. ఏదైనా అత్యవసర సమయంలో డిపాజిట్ మొత్తంలో 40 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చు. ముందుగా విత్‌డ్రా చేసుకుంటే వడ్డీ రేటు తగ్గే అవకాశం ఉంటుంది.

## రియల్‌ఎస్టేట్ ఏజెంట్లకు కేంద్రమంత్రి సూచన

భారత రియల్ ఎస్టేట్ రంగ వృద్ధికి వీలుగా.. కార్యకలాపాల్లో విశ్వాసం, పారదర్శకత ఉండేలా చూడాలని ఈ రంగానికి చెందిన ఏజెంట్లకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సూచించారు. 2030 నాటికి రియల్ ఎస్టేట్ మార్కెట్ రూ.85 లక్షల కోట్లకు చేరుకోనుందన్న అంచనాను ప్రకటించారు.నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ ఇండియా (నార్%-%ఇండియా) వార్షిక సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. అంతర్జాతీయంగా అత్యుత్తమ ప్రమాణాలను, కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని పరిశ్రమను కోరారు. నార్%-%ఇండియాలో 50వేల మంది ఏజెంట్లు సభ్యులుగా ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిలో ఏజెంట్ల పాత్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.డెవలపర్లు, వినియోగదారుల మధ్య వీరు కీలక వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఏజెంట్ల సూచలను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. 2016లో రెరాను తీసుకురావడాన్ని అద్భుత సంస్కరణగా పేర్కొన్నారు. డెవలపర్లు, కొనుగోలుదారుల మధ్య వివాదాల నివారణకు దీన్ని తీసుకొచ్చారు.అలాగే, రియల్ ఎస్టేట్‌లోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, వ్యాపార సులభతర నిర్వహణకు తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. 2047 నాటికి దేశ జనాభాలో సగం మంది పట్టణాల్లోనే నివసించనున్నట్టు చెప్పారు.

# 2030 నాటికి రెట్టింపు ఉద్యోగాలు



వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్ తమ కార్యకలాపాలకు సంబంధించి కీలకంగా ఎదుగుతోందని జర్మన్ సెమీకండక్టర్ల సంస్థ ఇన్ఫినియోన్ టెక్నాలజీస్ సీఎంవో ఆండ్రియాస్ ఉర్షిజ్ తెలిపారు. తమకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 58,000 మంది, భారత్‌లో 2,500 మంది పైగా ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో 2030 నాటికి ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు ఆయన వివరించారు.దేశీయంగా ఇతర భాగస్వాములతో కలిసి పని చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆండ్రియాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ గ్రూప్ ఆదాయంలో భారత్ వాటా సింగిల్ డిజిట్ స్థాయిలోనే ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరగనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, సమీప భవిష్యత్తులో ఇక్కడ తయారీ ప్లాంటు ఆలోచనేదీ లేదని వివరించారు. మరోవైపు, కొత్త ఆవిష్కరణలను వేగవంతం చేసే దిశగా ఎలక్ట్రానిక్స్, మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో స్టార్టప్‌లకు సహాయం అందించేందుకు వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆండ్రియాస్ చెప్పారు.సెమీకండక్టర్ పరిశ్రమలో ఇన్ఫినియాన్ టెక్నాలజీస్‌తోపాటు విభిన్న కంపెనీలు యువతకు అవకాశాలు కల్పిస్తుంది. ఈ పరిశ్రమలో ప్రధానంగా హార్డ్ వేర్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, చిప్ డిజైన్, క్వాలిటీ అస్యూరెన్స్, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగాలుంటాయి. ఇంటెల్, మైక్రాన్, ఇన్ఫినియన్ టెక్నాలజీస్, గ్లోబల్‌ఫౌండ్స్.. వంటి కంపెనీలు భారత్‌లో చురుకుగా నియామకాలు చేపడుతున్నాయి.

## ఒప్పో నుంచి ఎఫ్29 స్మార్ట్‌ఫోన్లు

**ధర రూ. 23,999 నుంచి ప్రారంభం**



స్మార్ట్‌ఫోన్ల తయారీ దిగ్గజం ఒప్పో తాజాగా ఎఫ్29 సిరీస్ ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో ఎఫ్29 ధర రూ. 23,999 నుంచి, ఎఫ్29 ప్రో మోడల్ రేటు రూ. 27,999 నుంచి ప్రారంభమవుతుంది. ఇవి వరుసగా మార్చి 27, ఏప్రిల్ 1 నుంచి లభిస్తాయని సంస్థ తెలిపింది. 6.7 అంగుళాల స్క్రీన్, 50 ఎంపీ కెమెరా, 6,500 ఎంఏహెచ్ వరకు బ్యాటరీ, కలర్‌ఓఎస్ 15, హంటర్ యాంటెన్నా తదితర ఫీచర్లు వీటిలో ఉంటాయని పేర్కొంది. భారతీయ పరిస్థితులకు తగ్గట్లుగా దుమ్మూ, నీరు, ఇతరత్రా ద్రవాల నుంచి అత్యధిక రక్షణ ఉండేలా రూపొందిచినట్లు ఒప్పో ఇండియా ప్రోడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ సేవియో డిసౌజా వివరించారు. దేశీయంగా కార్యకలా పాల విస్తరణపై నిరంతరం పెట్టు బడులు పెడుతున్నట్లు చెప్పారు. భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి కోసం నోయిడాలో 110 ఎకరాల్లో తయారీ ప్లాంటును నెలకొల్పినట్లు వివరించారు. తమ ఎఫ్27 ప్రోప్లస్ స్మార్ట్‌ఫోన్లకు ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ తదితర మార్కెట్లలో భారీ స్పందన లభిస్తోందన్నారు. ఎఫ్29 స్మార్ట్‌ఫోన్ల మీద ఎస్‌బీఐ కార్డ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మొదలైన వాటిపై 10% వరకు క్యాష్‌బ్యాక్, 10% వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆఫర్లు ఉంటాయి.


# ఎటిఎం లను టార్గెట్ చేస్తు చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

## యూట్యూబ్ లో చూసి ఎటిఎం లను టార్గెట్ చేసి దోచుకెళ్తున్న దొంగలు

## చాకచక్యంగా దొంగలను పట్టుకున్న ఆదిభట్ల పోలీసులు

## వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు






**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పరిధిలోని రావిర్యాల లో ఎస్బిఐ ఎటిఎంలో చోరీ చేసిన నిందితులను ఆరెస్ట్ చేసిన ఆదిభట్ల పోలీసులు నిందితులను బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు ఈ సందర్బంగా రాచకొండ కమీషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ...హర్యానా రాజస్థాన్ బార్డర్ కు చెందిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశాము.నిందితుల వద్ద నుండి నాలుగు లక్షల నగదు, షిఫ్ట్ కారు స్వాధీనం చేసుకున్నాము చోరికి ఉపయోగించిన గ్యాస్ కట్టర్స్ స్వాధీనం చేసుకున్నాము స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ 9 లక్షల యాభై వేలు అంటుంది...మార్చ్ రెండవ తేదీన రావిర్యాల ఎస్బిఐ బ్యాంకులో చోరీ చేసారు..గ్యాస్ కట్టర్ తో ఏటిఎం కట్ చేసి అందులో 29,69,900 నగదు దోచుకెళ్లారు.చోరీ కేసు చేధించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసాము...టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా రాజస్థాన్ హర్యానాకు చెందిన నేరస్తులు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించాము నిందితులు ఏటీఎం చోరీ కోసం రాజస్థాన్కు చెందిన జాహుల్ ఖాన్ యొక్క కార్ వాడారు.నిందితులు కారు నెంబర్ ప్లేట్ ను మార్చి ఆ కారును చోరికి వినియోగించారు .. ఆకారుపై నిఘా పెట్టాము.చోరీ తర్వాత అదే కారులో నిందితులు మార్చ్ 24 వ తేదీన మరోసారి ఏటీఎం చోరీ కోసం నగరానికి వచ్చారు .హైదరాబద్ వచ్చి కొంగర కలాన్ ఏరియాలో తిరిగారు.నిందితులపై నిఘా ఉంచడంతో కారుతోపాటు రాహుల్ ఖాన్, ముస్తఖిం ఖాన్, షకీల్ ఖాన్, వాహిద్ ఖాన్, షారుఖ్ బసిర్ ఖాన్ లను అదుపులోకి తీసుకున్నాం రాజస్థాన్ మరియు హర్యానా రాష్ట్రాలకు చెందిన వీరిలో అన్నదమ్ములు ఉన్నారు.. నిందితులు జెసిబి మెకానిక్ వెల్డింగ్ పనులు చేస్తూ ఉంటారునిందితులలో రాహుల్ ఖాన్ గతంలో హైదరాబాద్, ఒరిస్సా లలో గ్యాస్ కట్టర్లతో ఏటీఎం చోరీలకు పాల్పడ్డడు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లిన రాహుల్ ఖాన్ తీరు మారలేదు.ఈజీ మనీ కోసం ఏటిఎం చోరీలకు పాల్పడుతున్నారు. నిందితుల్లో ఒకరు సీసీటీవీ కెమెరాలకు స్ప్రే చేస్తే మరొకరు అలారం ను కట్ చేస్తారు రాహుల్ ఖాన్, రఫీఖ్ ఖాన్ ఇద్దరు గ్యాస్ కట్టింగ్ లో నేర్పరి తనం ఉంది డబ్బులు కాలిపోకుండ ఎటిఎం మిషన్ లో డబ్బులు చోరీ చేయడం గురించి యూట్యూబ్ లలో అవగాహనా పొందారు. పోలీసులు గుర్తు పట్టకుండా రాహుల్ ఖాన్ ఫిజికల్ చాలెంజింగ్ లాగ నటిస్తున్నాడు..ప్రధాన నిందితుడు రాహుల్ ఖాన్ పహాడి షరీఫ్ లో మెకానిక్ షెడ్ లో పని చేశాడు.మిగతా నిందితులు పటాన్ చెర్వు ఏరియాలో పని చేశారు.నిందితులు లోకల్ గా పనిచేస్తూ రిమోట్ ఏరియాలో ఉన్న ఏటీఎం లలో చోరీలు చేస్తారు.రావిర్యాల లో ఏటీఎం చోరీ నిందితులు మొత్తం చోరీ నిమిషాల్లో చేశారు చోరీ తర్వాత వివిధ మార్గాల్లో వెళ్తూ పోలీసులను తప్పుదోవ పట్టించారు..కుషాయిగూడ, (బిడిఎల్) భానూర్ లలో గతంలో ఏటీఎం చోరీ చేశారు..చాలా కాలం జైల్లో ఉండి బయటకు వచ్చి రావిర్యాల ఎటిఎం చోరికి పాల్పడ్డారు..రావిర్యాల చోరీ అనంతరం వెళ్తూ వెళ్తూ మైలర్ దేవ్ పల్లి లో కూడా చోరికి యత్నించారని కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు.



# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

### ఆనాడు మాకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు

### రేవంత్ మంచోడు కాబట్టే..మీరు మాట్లాడుతున్నారు

### అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్: అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆనాడు విపక్ష సభ్యులను కనీసం మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా విపక్షమే లేకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టే బీఆర్ఎస్ నేతలు ఇంకా ప్రశాంతంగా ఫామ్ హౌజ్‌లో ఉన్నారని లేదంటే.. నిన్నటి దాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒక లెక్క అనేలా పరిస్థితి ఉండేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో 8 వేల హత్యలు.. లక్ష దొంగతనాలు జరిగాయని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన అహంకారంతో సాగిందని.. తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన అధికార దుర్వినియోగానికి ఉదాహరణ అని అన్నారు.పోలీస్ అధికారులు కూడా బీఆర్ఎస్ అధికార దాహానికి బలయ్యారని.. బీఆర్ఎస్ పెద్దలు చెప్పిన అందరి ఫోన్లు ట్యాప్ చేసి ఇప్పుడు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ చేయించిన పాపాలతో పోలీసులు విదేశాలకు పారిపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పోలీసు వ్యవస్థను దారుణంగా వాడుకుందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్ పీసీసీ పదవిని రూ. 50 కోట్లకు కొన్నడని కోమటి రెడ్డి అన్నాడని కెటిఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డ రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం లేకుండా చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు మాకు నీతులు చెప్తున్నారని ఎద్దేవ చేశారు. ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. మీకు నాయకుడే లేడు.. సభకు రావడమే మానేశారని తెలిపారు. ప్రజల సమస్యలు చెప్పడానికి సభకే రావడం లేదు. రేవంత్ రెడ్డి మంచోడు కాబట్టి మీరు ఇంకా ఫామ్ హౌస్ లో ప్రశాంతంగా ఉన్నారు. లేకుంటే నిన్నటి నుంచి ఒకలెక్కా.. ఇవాళ్టి నుంచి ఇంకో లెక్క అన్నట్టు ఉండేది.సైరన్ సప్పుడు లెకుండా తిరుగుతున్నారు కాబట్టి వాళ్ళు అంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ లీడర్ల అందరి ఫోన్లు ట్యాప్ చేసి అధికార దాహానికి బలై పోయారు. అహంకారంతో సాగింది బీఆర్ఎస్ పాలన.. మేము ఆరుగురం ఉన్నప్పుడు మా గొంతు నొక్కారు. సభ మీ సొంతమా అని అడిగారు. ఇప్పుడు నేను అడుగుతున్న.. సభ మీ సొంతమా మరి.. వచ్చినప్పటి నుండి ఒకటే గొడవ.. మీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.. ఆ టైమ్ ప్రజల కోసం కేటాయిస్తే చాలు అని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

# అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు

హైదరాబాద్: సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో పూజారి సాయికృష్ణకు జీవత ఖైదు విధించింది రంగారెడ్డి కోర్టు. అప్సరను ప్రేమంచి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేశాడు పూజారి. అప్సరతో నాలుగేళ్లపాటు ప్రేమయాణం సాగించాడు. పెళ్లి చేసుకోమని వెంటపడటంతో.. శంషాబాద్ ప్రాంతంలో హత్య చేసి.. మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పడేశాడు. ఈ కేసులో రంగారెడ్డి కోర్టు నేడు తీర్పు వెల్లడించింది. అతడికి జీవిత ఖైదుతో పాటు.. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను కూడా విధించింది. వీటితో పాటు.. అప్సర కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో ఆమె పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం ఆమె 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చింది. కాశీలోని తన తండ్రి ఒక ఆశ్రమంలో పనిచేస్తున్నారు. తల్లితో కలిసి ఆమె సూరూర్‌నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె తల్లి ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. అప్సర దేవాలయాలకు తరచూ వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే అక్కడ పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. తనను పెళ్లి చేసుకోవాలని సాయిపై అప్సర ఒత్తిడి తెచ్చింది. పెళ్లి చేసుకుంటే సరి.. లేదంటే ఇద్దరి మధ్య సంబంధాన్ని భయటపెడతానంటూ ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు.

# సర్వే రూపంలో ప్రజా సమాచార చౌర్యం?

### కాంగ్రెస్ ప్రభుత్వంపై మేధావుల విమర్శలు

### కట్కూరి సందీప్ పెద్దపల్లి పార్లమెంట్ %వీూ% కంటెస్టెడ్ క్యాండిడేట్ ఆల్ ఇండియా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం తెలంగాణ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మీ..కట్కూరి సందీప్

**పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ బ్యూరో మార్చ్ 27 న్యూస్ :** హైదరాబాద్: ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలుపై విశ్వాసం లేకే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రీసర్వే చేపట్టడం ప్రజల్లో ఆందోళన రేపుతోంది. ఇప్పటికే నిర్వహించిన సర్వే వివరాలు అసలు ఉపయోగించారా? లేదా? అన్నది సందేహాస్పదంగా మారింది. మేధావులు, విద్యార్థి సంఘాలు, ఉద్యమకారులు ఈ తీరును తీవ్రంగా విమర్శిస్తూ, ప్రజా సమాచారం పట్ల ప్రభుత్వం అంత చురుగ్గా ఎందుకు వ్యవహరిస్తోందో ప్రశ్నిస్తున్నారు.

**సర్వే, రీసర్వేల వెనుక దాగి ఉన్న రాజకీయ గేమ్?**

ఇప్పటికే ప్రభుత్వం నిర్వహించిన సర్వేకు మరోసారి రీసర్వే అవసరం ఏంటి? అసలు సర్వే పూర్తయిన తర్వాత, అందులో పొందుపరిచిన డేటాను ఉపయోగించకుండా మళ్లీ కొత్త డేటా సేకరణకు ప్రయత్నించడం వెనుక అసలు ఆంతర్యమేంటి? ప్రభుత్వం నిస్వార్థంగా ఈ సర్వేలు నిర్వహిస్తోందా, లేక ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఇతర ప్రయోజనాల కోసం వాడుకోవాలనుకుంటోందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి.

**ప్రభుత్వం అసలు డేటా నమ్మడం లేదా?**

సర్వే ద్వారా ప్రజల వివరాలు, ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్న ప్రభుత్వం, వాటిని ఆధారంగా చేసుకుని పథకాలను అమలు చేయాల్సింది పోయి మళ్లీ రీసర్వే నిర్వహించడం అనుమానాస్పదమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రజల వ్యక్తిగత డేటాను ఇష్టానుసారం మార్చి, థియేటర్ మ్యానిప్యులేషన్ ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**ప్రైవేట్ సంస్థలకు ప్రజల సమాచారం అమ్మకానికి ప్లాన్?**

ఈ సర్వే ద్వారా ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరించి, అవి ప్రైవేట్ సంస్థలకు విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆధార్‌తో అనుసంధానం చేస్తే ఇప్పటికే ప్రజల అన్ని వివరాలు ప్రభుత్వానికి అందుబాటులో ఉంటాయి. మరి మళ్లీ సర్వే పేరుతో ఈ సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఏమిటి? కట్కూరి సందీప్ పెద్దపల్లి పార్లమెంట్ MP కంటెస్టెడ్ క్యాండిడేట్ ఆల్ ఇండియా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం తెలంగాణ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మీ..కట్కూరి సందీప్ KSP మాట్లాడుతూ, "ప్రభుత్వం పేద ప్రజల డేటాను అమూల్యమైన ఆస్తిగా చూస్తోంది. ఈ డేటాను ప్రైవేట్ సంస్థలకు అమ్మితే, అది ప్రజల వ్యక్తిగత గోప్యతపై పెద్ద ప్రమాదమే అవుతుంది. ఏదైనా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలంటే, ఈ రీసర్వే ఎందుకు అవసరమో స్పష్టంగా చెప్పాలి." అని వ్యాఖ్యానించారు.

**సాఫ్ట్‌వేర్ ఆధారిత డేటాబేస్ ఉంటే, మళ్లీ సర్వే ఎందుకు?**

**అన్ని సర్వేలు ఆధారిత అనుసంధానంగా ఉన్నాయా అనే కోణంలో ఆలోచిస్తే సరిపోతుంది కదా..?**

ప్రస్తుతం ఆధార్ ఆధారంగా బయోమెట్రిక్ పద్ధతిలో ప్రతి ఒక్కరి వివరాలు అందుబాటులో ఉన్నాయి. మరి మళ్లీ ప్రతి పథకాన్ని, రేషన్ కార్డులను కొత్తగా అనుసంధానం చేయాలనే అక్కసెందుకు? ప్రభుత్వం డేటా గోప్యతను ఉల్లంఘించి, ప్రజల వ్యక్తిగత సమాచారం చేతులు మారేలా చేస్తోందా? అనే ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు,




మేధావుల నుంచి ఉత్కంఠ కలిగిస్తున్నాయి.

**ప్రజల్లో ఆందోళన - మేధావుల హెచ్చరిక**

ప్రజా సంక్షేమానికి పనికొచ్చే విధంగా సర్వేలు జరగాలి కానీ, ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దోచుకునేలా ఉండకూడదని మేధావులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ప్రజల వివరాలను కాపాడాలని, డేటాను ఎవరితోనూ షేర్ చేయకూడదని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. "ప్రజల వ్యక్తిగత సమాచారం, వారి డేటా ప్రభుత్వ సమర్థ పాలనకు ఉపయోగపడాలి కానీ, అది వ్యాపార వస్తువుగా మారకూడదు. ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దుకుని, ఈ రీసర్వే వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని బయటపెట్టాలి. లేకపోతే ప్రజల్లో విశ్వాసం పూర్తిగా కోల్పోతుంది." అని మేధావులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం పారదర్శకంగా స్పందిస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. లేనిపక్షంలో, ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల కూడా అనుమానాలు ముదరవచ్చు.

## పంబన్ బ్రిడ్జికి త్వరలో మోడీ ప్రారంభోత్సవం



**చెన్నై,, (క్రైమ్ మిర్రర్):** తమిళనాడులోని సముద్ర తీరంలో ఉన్న చారిత్రక పంబన్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థానంలో అదే పేరుతో కొత్త పంబన్ బ్రిడ్జిని నిర్మించారు. ఆధునిక ఇంజనీరింగ్‌తో ప్రజలను, ప్రదేశాలను అనుసంధానిస్తూ వర్టికల్ లిఫ్ట్ విధానంలో భారత్‌తో నిర్మించి తొలి రైల్వే బ్రిడ్జి ఇదే కావడం విశేషం. వేగం, భద్రత, ఆవిష్కరణల కోసం రూపొందించిన బ్రిడ్జి ఇందంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఆ ఫోటోలను విడుదల చేశారు. దేశంలోని ప్రధాన భూభాగాన్ని తమిళనాడులోని రామేశ్వరం ద్వీపానికి ఈ బ్రిడ్జి కలుపుతుందని ఆయన తెలిపారు. ఈ వంతన మధ్యలో భారీ ఓడలు వచ్చినప్పుడు తెరుచుకునేలా ప్రత్యేక గేట్లు కూడా ఏర్పాటు చేశారు. కాగా, కొత్త పంబన్ బ్రిడ్జి ప్రారంభం కాగానే పాత వంతెనపై రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. 2020 ఫిబ్రవరిలో నిర్మాణం ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా జాప్యం చోటచేసుని ఏప్రిల్‌లో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

## పశ్చిమి గోదావరి జిల్లా
# అభివృద్ధికి చర్యలు

### మొల్తూరు, పెరుగొండ సమస్యలపై దృష్టి

### డిప్యూటి సిఎం ఆదేశాలతో 28న గ్రామసభలు



**అమరావతి,, (క్రైమ్ మిర్రర్):** గ్రామీణాభివృద్ధి శాఖను ప్రత్యేక స్వీకరించి, అభివృద్ధిపై దృష్టి సారించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పశ్చిమ గోదావరి జిల్లాపై ఇప్పుడు ఫోకస్ పెట్టారు. చిన్నతనంలో పవన్ పెరిగిన ప్రాంతాలైన మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే తన పేషీ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో, మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి కోసం ఈ నెల 28న గ్రామ అభివృద్ధి సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 28వ తేదీ ఉదయం మొగల్తూరు, సాయంత్రం పెనుగొండల్లో గ్రామలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అభివృద్ధి సభల్లో గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఆయా గ్రామాలకు కావల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై చర్చించి వాటిపై దృష్టిపెడతారు. అదే సమయంలో అయా గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను సైతం అధికారులు స్వీకరించి వాటి పరిష్కారంపై దృష్టిపెడతారు. తమ గ్రామాలకు సంబంధించి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారని.. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు చెప్పుకునే అవకాశం రావడంతో పెనుగొండ, మొగల్తూరు గ్రామానికి చెందిన ప్రజలు వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, ఫైర్ ఇంజన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన అంశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో పెనుగొండ గ్రామానికి సంబంధించి ఉన్న సమస్యలు అన్నింటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు సభకి హాజరుకావాలని ఇప్పటికే జనసేన నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.. మరోవైపు మొగల్తూరు గ్రామంలో ఎప్పటి నుంచో ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ, రహదారుల విస్తరణ వంటి అంశాలతో పాటు- పర్యాటకంగా ప్రాంతంలో అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో మురుగునీరు నేరుగా పంట కాలవల్లోకి చేరుతున్న పరిస్థితిపై అక్కడే రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించేందుకు రైతుల సైతం సిద్ధమవుతున్నారు. ఇంతకాలం సమస్యలు అపరిష్కృతంగా ఉండడానికి కారణాలు ఏంటి, భవిష్యత్తులో ఆయా గ్రామాల్లో చేయబోయే అభివృద్ధి పనులు ఏంటనే అంశాలను మరింత లోతుగా ఆరా తీస్తున్నారు.

# కూటమి సర్కార్ మరో కీలక నిర్ణయం

### విశాఖలో లూలూ గ్రూపునకు తిరిగి భూ కేటాయింపు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి,, (క్రైమ్ మిర్రర్):** చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం హార్బర్ పార్క్ సమీపంలో లూలూ గ్రూప్‌నకు గతంలో కేటాయించిన 13.83 ఏకరాలను తిరిగి ఆ గ్రూప్‌నకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. విశాఖపట్నంలో లూలూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టం చేసింది. అలాగే ఏపీఐఐసీ ద్వారా లూలూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖపట్నం నగరంలో లూలూ గ్రూప్ సంస్థ అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం, పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు పరిశ్రమల శాఖ ఇప్పటికే వెల్లడించింది. 2017లోనే విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 2023లో లూలూ గ్రూప్‌నకు గత ప్రభుత్వం చేసిన భూకేటాయింపులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మళ్లీ షాపింగ్ మాల్‌తోపాటు- హైపర్ మార్కెట్‌ల నిర్మాణం చేసేందుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి భూ కేటాయింపులు చేయాల్సిందిగా ఏపీఐఐసీని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశించారు. 2014లో ఏపీలో టిడీపీ ప్రభుత్వం కొలువు తీరగానే విశాఖపట్నంలో లూలూ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు.. నాటి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గత టీడీపీ ప్రభుత్వం చేసుకున్న పలు ఒప్పందాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. అందులో లూలూ గ్రూప్ సైతం ఉంది. అయితే లూలూ గ్రూప్ తమిళనాడులో తన పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ఏడాది జనవరిలో సీఎం చంద్రబాబుతో లూలూ గ్రూప్ సంస్థల అధినేత అమరావతిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు లూలూ కంపెనీ తన ఆసక్తిని కనబరిచింది. దీంతో గతంలో కేటాయించిన భూమిని తిరిగి కేటాయిస్తూ.. కూటమి



ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విశాఖలో లులూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఐఐసీ ద్వారా లులూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ఆదేశాలు జారీ చేసింది. లులూ గ్రూప్ సంస్థ విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు- పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2023లో లులూ గ్రూప్‌నకు చేసిన భూకేటాయింపులను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది.

## 14 ఏళ్లలో 81శాతం తగ్గిన నక్సల్స్ హింస

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** గడచిన 14 ఏళ్లలో దేశంలో నక్సల్ హింస 81 శాతం తగ్గిందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం రాజ్యసభకు తెలిపింది. 2010 నుండి 1,936 సంఘటనలతో గరిష్టస్థాయిలో ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రారు నేడు రాజ్యసభలో మాట్లాడుతూ.. 2024లో నక్సల్ వయెలెన్స్ సంఖ్య 374కి తగ్గిందని అన్నారు. పౌరులు, భద్రతా దళాలు మరణాల సంఖ్య 2010లో 1,005గా ఉంటే.. 2024కి 150కి తగ్గింది. అంటే 85 శాతం తగ్గుదల ఉంది అని ఆయన అన్నారు. కాగా, నక్సల్ హింస కేసులు 2023లో 485, 2022 : 413, 2021 : 361, 2020 : 470, 2010 : 501 నమోదయ్యాయి.

## పాస్టర్ మృతిపై లోతైన విచారణ

### హోంమంత్రి అనిత వెల్లడి

**రాజమండ్రి, (క్రైమ్ మిర్రర్):** పాస్టర్ పగడాల.ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హోం మంత్రి అనిత వెల్లడించారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిల్చేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా ? ఏమైనా ఇం-టె-న్షన్ ఉందా ? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటు-న్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి తెలిపారు.

# టూరిజం అభివృద్ధి ఎప్పటికీ అవసరమే

### ఆనాడు చెప్పిన మాటలను అపార్థం చేసుకున్నారు

### రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు సూచన




**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** టూరిజం అభివృద్ధి గురించి తాను ఆనాడు చెబితే ఎద్దేవా చేశారని, కానీ ఇప్పుడు అంతా గుర్తుకు చేసుకుని, తనవాదనకు బలం చేకూర్చారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను చెప్పిన మాటలను 30 ఏళ్ల తర్వాత తెలంగాణ అసెంబ్లీలో గుర్తు చెయ్యడం సంతోషం అన్నారు. గతంలో ఏ ఇజం లేదు టూరిజం ఒక్కటే అని తాను మాట్లాడితే తీవ్ర విమర్శలు చేశారన్నారు.. కలెక్టర్ల సమావేశంలో ఈ అంశాన్నే ప్రస్తావించారు సీఎం.. టూరిజంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు..తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ కలెక్టర్ల సదస్సులో రెండో రోజు చర్చ జరిగింది.. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టూరిజంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు.. ఇప్పుడు సమాజంలో ఏ ఇజం లేదు.. ఉన్నదంతా టూరిజమే అని నాడు చంద్రబాబు అనేవారు అంటూ చెప్పుకొచ్చారు కూనంనేని.. చంద్రబాబు నాడు ఇజంపై చెప్పిన మాటే నిజం అంటూ తెలంగాణ సభలో అభిప్రాయపడ్డారు ఎమ్మెల్యే కూనంనేని.. అయితే, పత్రికలో వచ్చిన ఆ వార్తను కలెక్టర్ల సదస్సుల్లో టూరిజం అంశంపై మాట్లాడుతూ ప్రస్తావించారు సీఎం చంద్రబాబు.. ఏ ఇజం లేదు అని నేను నాడు అంటే కమ్యునిస్టులు నాపై విరుచుకుపడ్డారు.. నాపై విమర్శలు చేశారు.. ఇప్పుడు తెలంగాణలో శాసన సభ్యుడు మాట్లాడతూ ఖర్చు లేని ఇజం టూరిజమే అంటూ నేడు స్టేట్‌మెంట్ ఇచ్చారు అని గుర్తుచేశారు.. తాను చెప్పిన మాటలను, తన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.. అయితే, ఇప్పుడు అంత సమయం లేదని.. త్వరగా ప్రాజెక్టులు తెచ్చి.. ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం చంద్రబాబు న్నారు..

## పారదర్శకంగా వృత్తి పన్ను వసూళ్లు

### ఏప్రిల్ 1 నుంచి వృత్తి పన్ను వసూలు

### రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** వృత్తి పన్ను వసూళ్లను సరళీకృతం చేసి మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని విజయవాడ 1, 2 డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్నుదారుల నుంచి పన్నుల వసూలును పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను వాణిజ్య పన్నుల శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.63 జారీచేసిందని, ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. వివిధ వర్గాలకు చెందిన వేతన జీవులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వారికి నిర్దేశిరచిన రేట్ల ప్రకారం వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటు-ందన్నారు. దుకాణ యజమానులు, రూ. 10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ. 15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు ఉద్యోగుల తరపున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాలని ఆయన వివరించారు. 2025, మార్చి పన్ను కాలానికి నెలవారీ ప్రొఫెషనల్ ట్యాక్స్ రిటర్న్‌ను వెబ్‌సైట్లో లాగిన్ అయి దాఖలు చేయాలని జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

## పోలీసులు నిర్లక్ష్యం

### 500 బదులు పదిలక్షల 500 ఫైన్.. కోర్టు సమన్లతో ఖంగుతిన్న విద్యార్థి

**గాంధీనగర్, (క్రైమ్ మిర్రర్):** సాధారణంగా హెల్మెట్ పెట్టుకోకుండా పోలీసులకు దొరికితే 500 నుంచి 1000 రూపాయల వరకు ఫైన్ ఉంటుంది. కానీ, ఓ విద్యార్థికి మాత్రం పోలీసులు ఏకంగా 10 లక్షల రూపాయల ఫైన్ వేశారు. అంత పెద్ద మొత్తంలో ఫైన్ పడటం చూసి అతడు షాక్ అయ్యాడు. ఈ సంఘటన అహ్మదాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఆ వివరాల్లోకి వెళితే.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన అనిల్ హాదియా. అనే లా విద్యార్థి బైకు మీదే లా కాలేజీకి వెళుతూ ఉంటాడు. గతేడాది ఏప్రిల్ నెలలో కూడా హెల్మెట్ లేకుండా బైకు నడుపుకుంటూ కాలేజీకి వెళుతూ ఉన్నాడు. శాంతిపుర ట్రాఫిక్ సర్కిల్ దగ్గర ట్రాఫిక్ పోలీసులకు దొరికాడు. దీంతో పోలీసులు అతడికి ఫైన్ వేశారు. కొద్దిరోజుల తర్వాత అతడి ఇంటికి కోర్టు సమన్లు వచ్చాయి. సమన్లు చదివి షాక్ అయ్యాడు.

క్రైమ్ మిర్రర్
స్పోర్ట్స్
10
గురువారం
27-3-2025

# అక్టోబర్‌లో భారత్‌కు మెస్సీ

## కేరళలో ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనున్న సాకర్ దిగ్గజం

తిరువనంతపురం : భారత ఫుట్‌బాల్ ప్రేమికులకు శుభవార్త. అంతర్జాతీయ ఫుట్‌బాల్ స్టార్, అర్జెంటీనా సారథి లియోనల్ మెస్సీ ఈ ఏడాది భారత్‌కు రానున్నాడు. కేరళలో రెండు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడేందుకు గాను మెస్సీ.. అర్జెంటీనా జట్టుతో కలిసి అక్టోబర్‌లో భారత్‌కు విచ్చేయనున్నాడు. బుధవారం హెచ్‌ఎస్‌బీసీ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. భారత్‌లో ఫుట్‌బాల్ అభివృద్ధికి గాను అర్జెంటీనాతో ఒక ఏడాది ఒప్పందం కుదుర్చుకున్న హెచ్‌ఎస్‌బీసీ.. కేరళకు రానున్న అర్జెంటీనా టీమ్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. గతేడాది నవంబర్‌లో కేరళ క్రీడా శాఖ మంత్రి అబ్దుర్ రెహ్మాన్ ప్రత్యేకంగా అర్జెంటీనాకు వెళ్లి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడేందుకు ఆ దేశాన్ని ఒప్పించిన విషయం విదితమే.





# సీఫర్ట్ మెరుపులు

వెల్లింగ్టన్ : పాకిస్థాన్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను న్యూజిలాండ్ 4-1తో చేజిక్కించుకుంది. బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో కివీస్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత పాక్.. నిర్ణీత ఓవర్లలో 128/9స్కోరుకు కుప్పకూలింది. సారథి సల్మాన్ (51) మరోసారి ఆ జట్టును ఆదుకున్నాడు. నీషమ్ (5/22) ఐదు వికెట్లతో చెలరేగాడు. ఛేదనను కివీస్ 10 ఓవర్లలోనే దంచేసింది. టిమ్ సీఫర్ట్ (38 బంతుల్లో 97 నాటౌట్, 6ఫోర్లు, 10సిక్సర్లు)ఇన్నింగ్స్‌తో కివీస్ అలవోకగా గెలిచింది.

# ఓటమి బాధలో ఉన్న పంత్ టీమ్‌కు అదిరిపోయే న్యూస్..



ఐపీఎల్-2025ను లక్నో సూపర్ జెయింట్స్ ఓటమితో ఆరంభించిన సంగతి తెలిసిందే. సోమవారం(మార్చి 24) వైజాగ్ వేదికగా జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో ఒక్క వికెట్ తేడాతో అనూహ్యంగా ఓటమి పాలైంది. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని లక్నో బౌలర్లు కాపాడుకోలేకపోయారు.తొలి 10 ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేసినప్పటి.. ఆఖరి 10 ఓవర్లలో లక్నో బౌలర్లు తేలిపోయారు. ఢిల్లీ ఆటగాడు అశుతోష్ శర్మ(31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులతో 66 పరుగులు) తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో లక్నో నుంచి మ్యాచ్ లాగేసుకున్నాడు.ఇక లక్నో సూపర్ జెయింట్స్ తమ తదుపరి మ్యాచ్‌లో మార్చి 27న ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు లక్నోకు ఓ గుడ్‌న్యూస్ అందింది. లక్నో సూపర్ జెయింట్స్ శిబిరంలో చేరడానికి స్టార్ పేసర్ అవేష్ ఖాన్‌కు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్ సర్టిఫికేట్ ఇచ్చింది. మోకాలి గాయంతో బాధపడుతున్న అవేశ్ ఖాన్ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావసం పొందుతున్నాడు. దీంతో అతడు ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లక్నో ఆడే తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు వార్తలు వినిపించాయి. కానీ త్వరగా కోలుకున్న అవేష్ ఖాన్.. మార్చి 24(సోమవారం) నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో పాసైనట్లు తెలుస్తోంది. దీంతో అతడు అనుకున్న దానికంటే ముందుగానే లక్నో జట్టుతో చేరనున్నాడు.కాగా ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో అవేష్ లేని లోటు లక్నో జట్టులో కన్పించింది. మరోవైపు లక్నోను గాయాల బెడద వెంటాడుతోంది.

# డికాక్ కేక.. కోల్‌కతా నైట్‌రైడర్స్ బోణీ

## అజేయ అర్ధసెంచరీతో విజృంభణ.. రాజస్థాన్‌కు రెండో పరాభవం



గువాహటి : ఐపీఎల్-18 సీజన్‌ను ఓటమితో ఆరంభించిన డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్(కేకేఆర్) రెండో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. బుధవారం గువాహటిలోని బర్సపర స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రాజస్థాన్ నిర్దేశించిన 152 పరుగుల ఛేదనను కోల్‌కతా.. 17.3 ఓవర్లలోనే పూర్తి చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (61 బంతుల్లో 97 నాటౌట్, 8ఫోర్లు, 6సిక్స్‌లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. కోల్‌కతా బౌలర్లు వరుణ్ చక్రవర్తి (2/17), మోయిన్ అలీ (2/23), వైభవ్ అరోరా (2/33) కట్టడి చేయడంతో తక్కువ స్కోరుకే పరిమితమైంది. ధ్రువ్ జురెల్ (28 బంతుల్లో 33, 5 ఫోర్లు) టాప్ స్కోరర్. డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### డికాక్ షో

స్వల్ప లక్ష్య ఛేదనను కోల్‌కతా కూడా నెమ్మదిగానే ఆరంభించింది. పవర్ ప్లేలో ఆ జట్టు చేసింది 40 పరుగులే. 12 బంతులాడి 5 పరుగులే చేసిన ఓపెనర్ మోయిన్ అలీ రనౌట్ అయ్యాడు. మూడో స్థానంలో వచ్చిన సారథి రహానే (18) కూడా నిరాశపరిచాడు. కానీ ఆరంభంలో ఆచితూచి ఆడిన డికాక్.. క్రీజులో కుదురుకున్నాక బ్యాట్‌కు పనిచెప్పాడు. హసరంగ 11వ ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదడంతో ఈ సీజన్‌లో అతడి తొలి అర్ధ సెంచరీ పూర్తయింది. రహానే నిష్క్రమించినా రఘువంశీ (22 నాటౌట్) సాయంతో డికాక్ మ్యాచ్‌ను ముగించాడు. డికాక్‌ను నిలువరించేందుకు రాజస్థాన్ తాత్కాలిక కెప్టెన్ పరాగ్ ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా లాభం లేకుండా పోయిం ది. బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న డికాక్ సమయోచిత ఇన్నింగ్స్‌తో ఈసీజన్‌లో జట్టుకు తొలి విజయాన్ని అందించాడు.

### నిలకడ లేమితో..

67/1. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 7.4 ఓవర్లకు చేసిన స్కోరిది. కానీ నాలుగు ఓవర్ల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 11 ఓవర్లకు 82/5గా మారి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంది. గత మ్యాచ్‌లో మెరుపులు మెరిపించిన శాంసన్ (13) కోల్‌కతాతో విఫలమైనా ఓపెనర్ యశస్వీ (24 బంతుల్లో 29, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ రియాన్ పరాగ్ (15 బంతుల్లో 25, 3 సిక్సర్లు) మెరుపులతో ఆ జట్టు ఇన్నింగ్స్ మెరుగ్గానే ఆరంభమైంది. హోంగ్రౌండ్‌లో 15 బంతుల్లోనే మూడు భారీ సిక్సర్లతో జోరు మీద కనిపించిన పరాగ్.. ఆ జోరును కొనసాగించలేకపోయాడు. కోల్‌కతా స్పిన్నర్లు వరుణ్, అలీ దెబ్బకు రాయల్స్ వరుస ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయింది. 8, 10వ ఓవర్లలో వరుణ్.. పరాగ్, హసరంగ(4)ను ఔట్ చేయగా 9, 11వ ఓవర్లలో మోయిన్.. జైస్వాల్, నితీశ్ (8)ను పెవిలియన్‌కు చేర్చాడు. శుభమ్ దూబే (9), హెట్‌మెయర్ (7) కూడా విఫలమయ్యారు. జురెల్ మెరుపులతో రాజస్థాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

**సంక్షిప్త స్కోర్లు**

**రాజస్థాన్:** 20 ఓవర్లలో 151/9 (జురెల్ 33, జైస్వాల్ 29, వరుణ్ 2/17, మోయిన్ 2/23)బీ

**కోల్‌కతా:** 17.3 ఓవర్లలో 153/2(డికాక్ 97 నాటౌట్, రఘువంశీ 22 నాటౌట్, హసరంగ 1/34)

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.